క్లుప్తంగా

పరిశుభ్రత పాటించాలి

నవాబుపేట: వర్షాకాలం నేపథ్యంలో అందరు పారిశుద్ధ్య చర్యలపై అందరు దృష్టిసారించాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో మండల అధికారులు, పంచాయతీ సిబ్బందితో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలకు సిద్ధం కావాలన్నారు. పరిశుభ్రత కేవలం అధికారులకు సంబంధించింది కాదని.. ప్రతివ్యక్తి బాధ్యతగా పాటించాలన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇండ్లు త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలని వివరించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ భద్రునాయక్, ఏపీఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం విజయవంతం



జడ్చర్ల టౌన్: మండలంలోని కోడ్గల్‌లో సోమవారం స్వర్గీయ డా.శ్వేత స్మారకార్థం నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో 481మందికి ఏనుగొండ ఎస్‌వీఎస్ ఆస్పత్రి వైద్య బృందం అవసరమైన పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. తన సతీమణి శ్వేత స్మారకార్థం నిర్వహించిన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శిబిరంలో వైద్య పరీక్షలను ఆయన దగ్గరుండి పరిశీలించారు. ఎస్‌వీఎస్ డాక్టర్ భరత్‌నందరెడ్డి ఆధ్వర్యంలోని వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే జిల్లా టీబీ నియంత్రణ అధికారి ఆధ్వర్యంలో 108మందికి టీబీ నిర్ధారణ పరీక్షలు చేసుకున్నారు. జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ యాదయ్య, ముడా మాజీ డైరెక్టర్ ఇమ్ము, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ప్రదీప్‌గౌడ్



దేవరకద్ర: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో పలువురు మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, మాజీ ఎంపీ మధుయాష్కిని కలిశారు.

పుట్టినగడ్డ రుణం తీర్చుకోవడం అదృష్టం



రాజాపూర్: జన్మనిచ్చిన గడ్డ రుణం తీర్చుకోవడం అదృష్టమని తహసీల్దార్ రాధాకృష్ణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రాయపల్లికి చెందిన సాఫ్టువేర్ ఉద్యోగి ప్రశాంత్‌చారి సొంత డబ్బులు రూ.30వేలు వెచ్చించి పంచాయతీ కార్యదర్శి అడిగిన వెంటనే వీధి లైట్లు అందజేశారు. ప్రశాంత్‌చారి గోనాయోంక ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ వెంకట్రాములు, పంచాయతీ కార్యదర్శి రవిప్రకాశ్, విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేష్, హెచ్‌ఎం రంజిత్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మల్లేశ్‌గౌడ్, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

బస్‌చార్జీలను తగ్గించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం పెంచిన బస్‌చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం బస్‌చార్జీలతోపాటు విద్యార్థుల పాస్‌ల మీద కూడా చార్జీలు పెంచడం పేదవిద్యార్థులకు శరాఘాతంగా మారిందని, పెంపు నిర్ణయం వివిధ గ్రామాల నుంచి జిల్లాకేంద్రానికి వచ్చి చదువుకునే విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సౌమ్య, సతీశ్, శివసాగర్, సాయి, అరవింద్, మహేశ్, టిల్లు పాల్గొన్నారు.



‘రైతునేస్తం’కు తరలివచ్చిన కర్షకులు



మిడ్జిల్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం సందేశం

మిడ్జిల్: రైతువేదికల్లో సోమవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి రైతులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రైతుభరోసా, భూభారతి వంటి తదితర పథకాలపై వీడియో కాన్ఫరెన్స్ సందేశాన్ని వీక్షించారు. కార్యక్రమంలో భాగంగా మిడ్జిల్ రైతువేదికలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు పాల్గొన్నారు. ఆయన వెంట జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, తహసీల్దార్ రాజు, ఏఓ సిద్దార్థ, ఏఈఓ భరత్, నాయకులు సాయిలు, గౌస్, సత్యం, మల్లికార్జున్‌రెడ్డి, ఆదాం, నరేందర్, ఉస్మాన్, విజయ్, సంపత్, వెంకటయ్య, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతునేస్తంకు అదనపు కలెక్టర్

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని రైతువేదికలో సోమవారం సాయంత్రం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఏఓ రాజేందర్ అగర్వాల్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జడ్చర్ల మండలంలో రైతునేస్తం

జడ్చర్ల: మండలంలోని మల్లెబోయిన్‌పల్లి, కోడ్గల్, నసరుల్లాబాద్‌లోని రైతువేదికల్లో సోమవారం రైతు నేస్తం కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని రైతులు విన్నారు. కోడ్గల్‌లో ఏర్పాటు చేసిన వీసీకి కొండేడు, పెద్ద ఆదిరాల రైతులు, నసరుల్లాబాద్‌లో వీసీకి గంగాపూర్ రైతులు, మల్లెబోయిన్‌పల్లిలో వీసీకి ఆలూరు, పోలేపల్లి రైతులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఓ గోపీనాథ్, తహసీల్దార్ నర్సింగ్‌రావు, ఎంపీడీఓ విజయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

రైతువేదికల చెంత రైతు ఉత్సవాలు

నవాబుపేట: మండల కేంద్రంతోపాటు రుద్రారం, లింగంపల్లి రైతువేదికల చెంత సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్, ఏఓ కృష్ణకిషోర్ రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు సీఎం సందేశం విన్నారు. ప్రత్యక్ష ప్రసారాల కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తులసీరాంనాయక్, బంగ్లరవి, సత్యం, సంతోష్‌నాయక్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రైతునేస్తంలో పాల్గొన్న రైతులు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖాముఖి మాట్లాడారు. రైతులతోపాటు తహసీల్దార్ రాజాగణేశ్, ఏఓ యామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్రలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్



మల్లెబోయిన్‌పల్లిలో హాజరైన రైతులు



కోయిలకొండలో పాల్గొన్న రైతులు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ విజయేందిర బోయి

జడ్చర్ల: ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. సోమవారం మండలంలోని పోలేపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ హాజరై భూసమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంలో గతంలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఉదండాపూర్ రిజర్వాయర్ భూసేకరణకు సంబంధించి అనర్హులకు పరిహారం అందడంపై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ దరఖాస్తులు 45

నవాబుపేట: మండలంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభల్లో 45దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ సువర్ణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మండలంలోని దర్పల్లి, గురుకుంటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని ప్రజలకు భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. అలాగే రైతుల సమస్యలను వినతుల రూపంలో తీసుకున్నారు. కాగా ఈ సందర్భంగా దర్పల్లిలో 27, గురుకుంటలో 18 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

దేవరకద్ర: బల్సుపల్లిలో సోమవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి పరిష్కరిస్తామని డీటీ దీపికా రైతులకు తెలిపారు.

ప్రతిఒక్కరూ యోగా అలవాటు చేసుకోవాలి



తెలంగాణ చౌరస్తాలో యోగా వాక్‌లో పాల్గొన్న వైద్యాధికారులు, విద్యార్థులు

పాలమూరు: ప్రతి ఒక్కరూ దినచర్యలో యోగ అలవాటు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ కృష్ణ, జిల్లా ఆయుష్ శాఖ ప్రోగ్రాం అధికారి సురేశ్‌చౌహాన్ సూచించారు. ఈనెల 21న ప్రపంచ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో జిల్లా క్రీడా మైదానం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు యోగ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యోగతో ఆరోగ్యంతో పాటు మనస్సు, జ్ఞానేంద్రియాలు తమ అధీనంలో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌పీ వెంకటేశ్, ఎల్‌డీఎం భాస్కర్, డీఎస్‌డీవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషన్ మహేశ్వర్‌రెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్, ఆయుష్ వైద్యులు చంద్రశేఖర్, రూత్, పహీం, ఆదిశేషయ్య పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక గణేశ్‌నగర్‌లో చేపట్టిన డ్రెయినేజీ విస్తరణ పనులను సోమవారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శాంతయ్యయాదవ్, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల మృతికి వీసీ సంతాపం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన అధ్యాపకులు వినోద్‌కుమార్, మద్వాశ్ మృతికి పీయూ వీసీ శ్రీనివాస్ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పీయూలో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, కంట్రోలర్ ప్రవీణ, అడిషనల్ కంట్రోలర్ శాంతిప్రియ, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, రవికాంత్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

జడ్చర్ల: పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన సంతోష్‌కుమార్ ఆదివారం నుంచి కనిపించకుండా పోయాడని సీఐ కమలాకర్ తెలిపారు. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళనకు గురైన భార్య మంగళి సంధ్య చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోయిందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గ్రామకంఠం భూములను రక్షించాలని ఫిర్యాదు

- త్రిసభ్య కమిటీని వేసిన కలెక్టర్

జడ్చర్ల టౌన్: మండలంలోని కొత్తతండాలోని గ్రామకంఠం భూమిని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సోమవారం తండావాసులు కలెక్టర్ విజయేందిర బోయికి ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ త్రిసభ్య కమిటీని వేసి పూర్తి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కొత్తతండా గ్రామకంఠం భూమికి సంబంధించిన 135–2, 135–3 సర్వే నెంబర్లలో 20గుంటల భూమిని మహ్మద్ సల్మాన్ అనే వ్యక్తి నుంచి ప్రభుత్వ ఉద్యోగి అయిన కేతావత్ గోవింద్‌నాయక్, అతని సోదరుడు సక్రునాయక్ 2023లో కొనుగోలు చేశారు. నాలా కన్వర్షన్ చేసుకుని నాన్ అగ్రికల్చర్ భూమిగా మార్చుకున్నారని ఫిర్యాదులో పొందుపర్చారు. తర్వాత 9మందికి అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని ఆ ఫిర్యాదు ద్వారా కలెక్టర్‌కు వివరించారు. అందులో ఇటీవల నిర్మాణాలు చేపట్టారని, వాటిని వెంటనే అడ్డుకోవాలని స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని తెలియజేశారు. స్పందించిన కలెక్టర్ డీపీఓ, ఆర్డీఓ, ముడా కమిషనర్‌తో త్రిసభ్య కమిటీ వేస్తున్నట్లు ప్రకటించారు. వెంటనే అక్రమ నిర్మాణాలు అడ్డుకుని పూర్తిస్థాయి విచారణ జరిపించి భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తండవాసులు రమేశ్‌నాయక్, ఉమ్లానాయక్, భద్రునాయక్, చందర్‌నాయక్ విలేకరులకు తెలిపారు.

టీపీఎఫ్ మహాసభలు విజయవంతం చేయాలి

పాలమూరు: వరంగల్‌లో ఈనెల 29, 30తేదీల్లో జరిగే టీపీఎఫ్ నాలుగో రాష్ట్రస్థాయి మహాసభలను విజయవంతం చేయాలని టీపీఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మన్యంకొండ అన్నారు. జిల్లా కేంద్రంలో యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం పోస్టర్లు ఆవిష్కరించారు. టీపీఎఫ్ మహాసభలకు ప్రజాస్వామికవాదులు, కార్మికులు, విద్యార్థులు, మేధావులు, నిరుద్యోగ యువకులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర సభ్యుడు వామన్‌కుమార్, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్, గంటన్న, వెంకటయ్య, విజయ్, రాజు, వెంకట్రాములు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి: ఎమ్మెల్యే జీఎంఆర్



జానంపేటలో హాజరైన ఎమ్మెల్యే జీఎమ్మార్

అడ్డాకుల: రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం జానంపేట రైతువేదికలో సోమవారం సాయంత్రం జరిగిన రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆధునిక పంటల సాగు, పంటల యాజమాన్య పద్ధతులు, నూతన సాంకేతికతతో వ్యవసాయ సాగు తదితర అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్తలతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరై సీఎం ప్రసంగాన్ని తిలకించారు. రైతునేస్తం ద్వారా పంటల సాగుకు రైతులకు ఉపయోగపడే సూచనలు, సలహాలు అందుతాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. రైతులు నూతన వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలను సాగు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ కృష్ణయ్య, ఏఓ అనిల్‌కుమార్, నాయకులు అరవింద్‌రెడ్డి, జగదీశ్వర్, లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రచారం కాదు.. పనిచేసే ప్రభుత్వం

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: ప్రచారాలు కాదు.. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల కోసం పనిచేసే ప్రజాప్రభుత్వం మనదని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం గ్రామంలో నూతనంగా మంజూరైన అంగన్‌వాడీ భవనం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు అండగా ఉండేందుకు ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం రేవంత్‌రెడ్డి తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు నిధులు మంజూరు చేసిన కోటీ నలభై తొమ్మిది ఎకరాలకు రైతుభరోసా ప్రకటించారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాధాకృష్ణ, నాయకులు నరహరి, కృష్ణయ్య, గోవర్ధన్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, రమణ, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

న్యాయవాద రక్షణ చట్టం అమల్లోకి తేవాలి

- విధులు బహిష్కరించి ఆందోళన చేసిన న్యాయవాదులు



కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న లాయర్లు

పాలమూరు: న్యాయవాదులపై దాడులు చేసినవారిని వెంటనే చర్యలు తీసుకోవడంతోపాటు సరైన శిక్షలు పడేవిధంగా చూడాలని బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాములు, ఉపాధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. హైదరాబాద్‌లో న్యాయవాదులపై దాడితోపాటు కిడ్నాప్ వ్యవహారాన్ని నిరసిస్తూ సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేయడంతోపాటు తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. న్యాయవాద రక్షణ చట్టాన్ని ప్రభుత్వాలు అమల్లోకి తీసుకురావాలన్నారు. న్యాయవాదులందరూ ఏకథాటిపై నిలబడి చట్టం అమలు అయ్యేవరకు పోరాడాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వెంకట్‌రావు, రాఘవేందర్, కృష్ణ, వినోద్, చంద్రమౌళి, రఘుపతి పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

గండేడ్: మండల ప్రజలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టీఆర్ఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగే వైద్యశిబిరంలో ప్రజలకు ఉచితంగా అన్ని రకాల వైద్యసేవలు అందించనున్నట్లు వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధ్వానంగా మట్టిరోడ్లు

- ఇరువైపులా కమ్మేసిన కంపచెట్లు
- రాకపోకలకు వాహనదారుల అవస్థలు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని దాసర్‌పల్లి నుంచి పొన్నకల్ వరకు ఉన్న మట్టిరోడ్డుతో ఇరు గ్రామాల ప్రజలు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. దాసర్‌పల్లి నుంచి రోడ్డుపై గుంతలు ఏర్పడడంతోపాటు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. పొన్నకల్ వైపు నుంచి ఇటీవల రోడ్డుపై మట్టిని వేసి కొంతదూరం రోడ్డును చదును చేశారు. దాసర్‌పల్లి వైపు మాత్రం రోడ్డు పూర్తి అధ్వానంగా మారింది. ఇదిలా ఉండగా తుంకినీపూర్ నుంచి వేముల రోడ్డు వరకు ఉన్న మట్టి రోడ్డు కూడా పూర్తిగా పాడైంది. రోడ్డంతా గుంతలమయంగా మారడంతోపాటు గుంతల్లో వర్షం నీరు నిలవడంతో కనీసం ద్విచక్రవాహనాలు వెళ్లడానికి కూడా ఇబ్బందులు తప్పేలా లేవు. రోడ్డంతా బురదగా మారి నడిచి వెళ్లడానికి వీల్లేకుండా ఉంది. ఇక్కడ కూడా రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి మట్టిరోడ్లను బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



దాసర్‌పల్లి, పొన్నకల్ మధ్యన రోడ్డు దుస్థితి

మా ప్లాటు మాకు ఇప్పించండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని మోతినగర్‌లో సర్వే నెంబర్ 227/7లో మాకు 150 గజాల ప్లాటు ఉందని, ఈ ప్లాట్‌ను మాకు ఇప్పించాలని సంతోష్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ విజయేందిరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈప్లాటును కొంతమంది మాకు కాకుండా చేస్తున్నారని, మాప్లాటుకు సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నాయని తెలిపారు. మా ప్లాట్ ప్రభుత్వ భూమి అని మా పక్క ప్లాట్‌వాళ్లు తప్పుడు కేసు వేశారని.. అది ఏ మాత్రం నిజం కాదని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఉన్న ప్లాట్ మాకు ఇప్పించాలని కోరారు.

పేదింటి పెళ్లికి ఆర్థిక సాయం

దేవరకద్ర: మండలంలోని వెంకటాయపల్లికి చెందిన పేదింటి పెళ్లికి జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్ సోమవారం రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు రవి, వెంకటేశ్, శివయాదవ్, సాయిలు, ఆంజనేయులు, సత్తిరెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిరావాలి

జడ్చర్ల టౌన్: మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా హలో దివ్యాంగి చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు తెలిపారు. సోమవారం ఎమ్మార్పీస్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19న హైదరాబాద్ నాగోల్ శుభం కన్వెన్షన్‌లో జరిగే సన్మాన కార్యక్రమానికి పెద్దసంఖ్యలో దివ్యాంగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్రా బిక్షపతి, మాదిగ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే టీఆర్ఆర్



మహమ్మదాబాద్: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ధరణితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రజల కష్టాలు తీర్చి రెవెన్యూ సేవలను సులభతరం చేయడానికే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. అదేవిధంగా ఎమ్మెల్యే మండలంలోని లింగమయ్యపల్లి, చౌదర్‌పల్లిలో సీసీరోడ్లు, హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతి, నాయకులు రాంలాల్, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, రాధారెడ్డి, చెన్నయ్య, లక్ష్మీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు



జడ్చర్ల టౌన్: బాదేపల్లి–బూరెడ్డిపల్లి రోడ్డులోని పొట్టిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం లోక కల్యాణార్థం, ఆర్యసమాజ భక్తబృందం ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీసూక్తసహిత గాయత్రి యజ్ఞం నిర్వహించారు. ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో యజ్ఞం జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. యజ్ఞంలో ఆర్యసమాజ పెద్దలు విజయ్‌కుమార్, నర్సింహులు, బక్కరాజు, సంజీవ్ గురూరి, రామ్‌కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

‘సెల్‌ఫోన్’ అప్పగింత

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన ఎరుకలి శ్రీనివాసులు సెల్‌ఫోన్ తప్పిపోగా పోలీసులు గుర్తించి బాధితుడికి సోమవారం అప్పగించారు. మూడు నెలల కిందట శ్రీనివాసులు తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన పోలీసులు హైదరాబాద్‌లో సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించి దాన్ని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం అడ్డాకుల ఠాణాలో బాధితుడికి ఎస్ఐ శ్రీనివాస్ సెల్‌ఫోన్‌ను అప్పగించారు.

మిత్రుడికి ఆర్థిక సాయం

దేవరకద్ర రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమ బాల్యమిత్రుడికి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు తోటి స్నేహితులు.. ముచ్చింతలకు చెందిన మన్యంకొండ కొన్నినెలలుగా వెన్నెముక, టీబీ వ్యాధితో బాధపడుతున్నాడు. తనతోపాటు కౌకుంట్ల ఉన్నత పాఠశాలలో 1998–99లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు విషయం తెలుసుకొని రూ.40వేలు పోగు చేసి సోమవారం మిత్రుడికి అందజేశారు. భవిష్యత్‌లోనూ అండగా ఉంటామని మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.